# పాహిమాం.. పాహి...పాహి...

సూర్యా ప్రసాదరావు

చెంగయ్య గబగబా గంగయ్య దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడు.


"గంగయ్యన్నా.. గంగయన్నా..."

"ఏం చెంగయ్యా.. ఏమయ్యింది? "గంగయ్యన్నాడు. కాలుతోన్న చుట్ట నుసి రాల్చుకుంటూ.

"మరే. మరే." చెంగయ్య రొప్పుతున్నాడు.

"ఇలా కూచో." గంగయ్య రచ్చబండ చూపించాడు.

రచ్చబండ ! హరిజనవాడలో. ఏ సమస్య వచ్చినా చర్చించుకోడానికి వారేర్పరచుకున్న స్థలం ! అందరూ కష్టసుఖాలు చెప్పుకునే చోట... పరిష్కారం కోసం పది మంది తలలు కలుసుకునే సమావేశ స్థలం. అదీ సాయంత్రం ఐదు తరవాత ! !



చల్లని మర్రి చెట్టు కింద గంగయ్య ఆవాడ కంతకూ అంతకంటె చల్లని నీడ ! అపకారికి సైతం ఉపకారం చేయమనే పరోపకారి ! ఆ వాడకు అతను హితుడు. సన్నిహితుడు. స్నేహితుడు ! అందుకనే అతను ఆవాడకు తలలోని నాల్క. ఎంత సమస్య అయినా అతని ముందు దూది పింజెలా తేలిపోవలసిందే.

అందుకే చెంగయ్య గంగయ్య దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

ఇంతలో రంగయ్య కూడా రంగప్రవేశం చేశాడు.

"గంగయ్యన్నా.. గంగయ్యన్నా.."

"ఏందిరా. రంగా ఏమయింది?" గంగయ్య గొంతులో కొద్ది ఆదుర్దా తొంగి చూసింది.

"మరేమో. మరేమో. మనల్ని ఊరి బావికాడికి రానియ్యరంట ! "రంగయ్య రొజుతూ రొప్పుతూ చెప్పేశాడు.

"అదే అన్నా నేనూ అదే చెబుదామని వచ్చా. చెంగయ్య వంత పలికాడు.

గంగయ్యకు ఈ కంప్లెయింట్ వినడం ఐదోసారి !

"ఎందుకంటరా.. ఎందుకంట?"

ఏమో ! ఊరి బయట వున్నోళ్లం. ఊరి బావికాడికి రాగూడదంట"

"మనం ఏ తప్పు చేశామంట?"

"మనం అంటరాని వాళ్లమంట. అందుకని మనల్ని వాళ్ల బావి నీళ్లు తోడు

మాష్టారు [పరీక్ష హాల్లో]:- పిల్లలూ! అందరూ ఓసారి మీ జేబులు చెక్ చేసుకోండి.
ఓ స్టూడెంట్:- కాపీలన్నీ భద్రంగానే ఉన్నాయండీ! అంటూ నాల్కకరుచుకొన్నాడు.



కో నియ్యరంట"

"ఎవర్రా. ఆ మాటలందీ?"

"ఆళ్ళే.. ఆళ్లంతా.. దూరంగా కనిపించే పెంకుటిల్లు వైపు, డాబాలు, మేడలు, మిద్దెలవైపు రంగయ్య చూపించాడు.

గంగయ్య ఆలోచనగా చూస్తున్నాడు.

"మరెట్టాగన్నా" చుట్టుపక్కల వాళ్లు ప్రశ్నించారు.

"ఆ బావి వారొక్కరి సొత్తేనా.. ఊరి బావంటే ఊరందరిదీ !" చెంగయ్య మరింత ధీమాగా అన్నారు.

"మనందరిదీలే. అందుకు వాళ్ళతో కొట్లాడి పగలు పాతేసుకుందామా ?" గంగయ్య అన్నారు.

"అసలే వచ్చేది ఎండాకాలం. ఆ భావి లేకపోతే మనమంతా మలమలా మాడి చావాలి"

"పగలు పాతేసుకోకపోయినా గుక్కెడు నీళ్లు పుట్టే దెట్టన్నా !"

తలా ఒక మాట అంటున్నారు.

"ఉన్నమార్గమేదో నువ్వే చెప్పు" చెంగయ్య గొంతులో నిష్ఠూరం వినిపిస్తోంది. అసలు ఆ బావిని త్రవ్వింది ఎవ్వరంట?" గంగయ్య ప్రశ్న వేశాడు.

"ఎవరూ. మనవేఁ కష్టపడి సెమటోడ్చి సల్లని నీరు సేవించాం" రంగయ్యన్నాడు.

"ఊరి మధ్యలో ఉండడం చేత బావి వరమైంది. చెంగయ్య అక్కసుగా అన్నాడు.

"అటువంటి మరో బావిని మనం స్వంతం చేసుకుంటే "గంగయ్యసాలోచనగా అంటే.

"అంటే"

"మనమంతా ఆ పాడు ఊరికి దూరంగా మరో బావి త్రవ్వుకుందాం. అప్పుడు మనం ఆ పాడు ఊర్లోకి వెళ్లక్కరలేదు"

బలే.. బలే.. అంటే మనవేఁ ఆ వూరిని ఎలేత్తున్నామన్నమాట" రంగయ్య ఉత్సాహంగా అన్నాడు.

"అంతే. అంతే. అలాగే. అలాగే" అందరూ ముక్తకంఠంతో అన్నారు. స్థల నిర్ణయం, కాల నిర్ణయం, పనివాళ్ళ నిర్ణయం క్షణాల్లో జరిగిపోయాయి.

హరిజనవాడకు దూరంగా ఊరికి చాలా దూరంగా బావి తవ్వకం జరిగిపోతోంది.

ఆడా, మగా భేదం లేకుండా పెద్దవాళ్లంతా పనులకువెళ్లిపోయిన వేల!.. పట్టపగలే దారుణం ! !

"అమ్మో ! నాయనో ! దేవుడో ! రచ్చించండో'

హాహాకారాలు ! !

ఇళ్లలోపనుండి పారిపోతున్న వాళ్లు

వాళ్లను తరిమి తరిమి వెంటాడిన వాళ్లు.

కాళ్ళువిరిగిన వాళ్లు. చేతులుకోల్పోయిన వాళ్లు.

ముసలీ, ముతకా, పిల్లా, జెల్లా..

కాలిపోతున్న గుడిసెలు.

బయటకు విసిరి వేయబడ్డ సామాన్లు.

హాహాకారాలు

శ్రవణానందకరంగా కొందరికీ...

ప్రాణ రక్షణ పరిదేవనంగా అక్కడి వారందరికీ.

పనులకు వెళ్లిన వాళ్లు తిరిగి వచ్చేసరికే ఘోరపరిణామాలు.

విషాదకర విధ్వంసక దృశ్యాలు.

అధికారులూ. రాజకీయ నాయకులూ వచ్చారు. పరామర్శించారు. వెళ్లారు. బాధితులు .. బాధితులుగానే ఉండిపోయారు.

బావిత్రవ్వకం పూర్తయిపోయింది.

ఊరికి దూరంగా. మరింత దూరంగా ఊరి వెలుపలనున్న హరిజనవాడ కొత్త బావి దగ్గరకు వెళ్లిపోయింది.

"ఇక్కడ ఎలా ఉంటామన్నా. కరెంటు లేదుగా."

లేకపోతే యేంరా.. సల్లని ఎన్నెల వుందిగా"

"పురుగూ పుట్రా రాత్రిపూట తిరుగుతుంటాయటగా"

"అవి మనల్నేమీ సెయ్యవు బాబాయ్ ! వాటికిమనం యేదయినా సేత్తేనే అవి మనల్ని కుట్టేది. కానీ మాయదారి మడిసి అట్టాకాదు. ఆడికి మనం యేమీ అపకారం సెయ్యకపోయినా కసిదేవుకొని కాటేత్తాడు.

"అంతే. అన్నా ! అంతే !"

అరాచకత్వానికి, అత్యాచారానికి, వర్ణవర్గ వైషమ్యాలకు బలియైన వారంతా ఒకరికొకరు ఓదార్చుకుంటున్నారు.

పాతిక పాకలు. క్రమేపీ ఏభై గుడిసెలయ్యాయి.

కొన్ని పెంకుటిళ్లు తలెత్తాయి.

నిర్వాసితులంతా ఎల్లలు పెంచుకున్నారు.

వారు విడిచిన ఊరు పట్నమైపోయింది. పట్నం పరిధులు పెంచుకొంది.

పట్నం రహదారికి ఆ హరిజనవాడ అడ్డం వచ్చింది.

అంతే ! పట్నం ఆగ్రహించింది.

'ఆ వాడను అక్కడి నుంచి లేపాలి. వారిని దూరంగా మరింత దూరంగా తరిమి కొట్టాలి'.

అంతే ! హరిజనవాడకు నోటీసులుజారీ అయ్యాయి.

'త్వరలో. ఆ జాగానుఖాళీ చెయ్యమని !'

పది సంవత్సరాలుగా పిల్లాజెల్లాతో పచ్చ పచ్చగా ఉంటున్న నేల...

ఘర్మ జలాన్ని ధర్మజలంగా మార్చి కొబ్బరి నీరు లాంటి నీటినిచేపించుకున్న నేల...

తుప్పలను మంచినేలగా నేలను పాకలుగా, పాకలనుపూరిళ్లుగా, పూరిళ్లు పెంకుటిళ్లుగా మార్చుకొన్న నేల.

'ఎలా విడిచి వెళ్లడం? ఎక్కడకు వెళ్లడం?

ఇన్ని కుటుంబాల గోడు ఆలకించేనాథుడే లేడా !

అధికారులకు అర్జీలు పెట్టుకొన్నారు. రాజకీయ ఓనమాలు దిద్దుకోకవారి దగ్గర నుండి ఔపోసన పట్టిన పురుషోత్తముల వరకూ కలుసుకున్నారు.

అందరూ.. చూదామన్నారు. చేదామన్నారు. పైవారికి చెప్పి చూదామన్నారు చెప్పి చేయి చూదామన్నారు. లేచి చూడమన్నారు.

రోజులు గడిచిపోయాయి. వారాలు నెలలయ్యాయి. మరో నెల రోజుల్లో ఆ ప్రదేశం ఖాళీ చేయమనివారికి ఆఖరి ఆదేశాలు జారీ అయ్యాయి.

"ఎలాగన్నా. ఈడనుండి పోవడం?"

"ఎలాగ బాబాయ్ ! ఈ జాగా ఖాళీ ఛేయడం?"

"పిల్లా జెల్లాతో ఇప్పుడు యేడకుపోతాం?' యేమైపోతాం?"

గంగన్న ఆలోచిస్తూ ఉన్నాడు.

అతనికీ ప్రదేశం వదిలి పెట్టకూడదనే ఉంది. 'కష్టపడీసంపాదించుకున్న పరిసరాలు. ఇదివదిలి ఎక్కడకుపోవాలి? ఇదివదిలితే వాళ్లు అక్కడ కూడా ఎసరు పెట్టరని గ్యారంటీ ఏమిటి?'

'ఎలా..ఎలా.. ఈ సమస్యను పరిష్కరించడం?'

ఆలోచిస్తూనే ఉన్నాడు.

గంగన్న ఆలోచనలు అన్వేషిస్తూనే ఉన్నాయి.

'పాహిమాం.. పాహి' అన్న గజేంద్రుని రక్షించిన కరివరదుని కోసం

'చిన్ని ప్రహ్లాదుని బ్రోచిన నారసింహుని కోసం..'

తమను రక్షించే వారికోసం. తరుణోపాయం కోసం.

రేడియో కార్యక్రమాలు వింటున్న వాడల్లా ఉలిక్కిపడ్డాడు

గంగన్నకు తరుణోపాయం లభించింది !

సాయంత్రానికి సమావేశం ఏర్పాటు చేశాడు.

అందరికీ తలలో నాల్కలా తన పరిష్కారమార్గం వినిపించాడు. అందరినీ ఔననిపించాడు.

హరిజనవాడ ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిన సమయం వచ్చేసింది ! అధికారులు సర్వేకు వచ్చారు.

అధికారులతో సంతోష సల్లాపాలతో మిగిలినవాళ్లూ ఆ ప్రాంతానికి వచ్చా[illegible]

ఆ వాడకు ముందు మర్రిచె[illegible]డలా ఉన్న ఆ నగరం పేరు చూచి క్షణకాలం విస్తుపోయారు.

బోర్డుదాటికొద్దిగా ముందుకు వెళ్తే ఓ ఎత్తయిన కట్టడం.. పెద్ద పెద్ద కిటికీలు. పెద్ద పెద్ద ద్వారాలు. శిఖరాగ్రాన ఓ పెద్ద గంట !

ఆ కట్టడంలోంచి నలుదిశలా అమర్చబడిన మైకుల నుండి ప్రసంగం వినబడుతోంది !

బిడ్డలారా. నిన్ను నీవు రక్షించుకోలేవు. నిన్నూ నన్నూ సర్వజనులనూ రక్షించగలిగింది ఆ ప్రభువు ఒక్కడే ! ఆ ప్రభువునే శరణు వేడుకో ! ఆ ప్రభువే నిన్ను రక్షిస్తాడు"

నిశ్శబ్దంగఆ అధికారులు వింటున్నారు.

చర్చి మైకుల్లోంచి వినిపిస్తోన్న 'అ రక్షకుని రసవద్గీతను' /

మరో పది నిముషాల్లో అందరూ బయటకొస్తున్నారు.

ముందుగా బయటకు వచ్చిం[illegible] గంగయ్య / డేవిడ్ గంగయ్య ! !

తరువాత.. రంగయ్య ! మైకేల్ రంగయ్య ! ఆ తరువాత చెంగయ్య ! శామ్యూల్ చెంగయ్య !

ఒక్కొక్కరూ భార్యా పిల్లలతో వాళ్ల నగరానికి వెళ్లిపోతున్నారు.

సరిగ్గా. చర్చి వెనగ్గా అనేక వరసల్లో పూరిళ్లు, పెంకిటిళ్ళు.

గంగయ్య, చెంగయ్య, రంగయ్య వెనక్కి తిరిగి చూచి చూచి మరీ వెళుతున్నారు.

ఆ రోజు తమను తరిమిన వారిని తమను హాహాకారాలు పెట్టించిన వారిని..'

అధికారులు అలా నిశ్చేష్టులై చూస్తూనే ఉండిపోయారు.

ఆ హరిజన వాడ ముందున్న బోర్డును చూచి.

అది'బెత్లెహామ్‌నగర్ ! !'

●